

జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న గ్యాస్ట్రో వైద్య నిపుణులు

## వేగంగా పెరుగుతున్న కాలేయ వ్యాధులు

- గ్యాస్ట్రో వైద్య నిపుణుల హెచ్చరిక

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): దక్షిణ భారతదేశంలో కాలేయ వ్యాధులు వేగంగా పెరిగిపోతున్నాయని, దీనిపై అందరికీ అవగాహన అవసరమని యశోద హాస్పిటల్ గ్యాస్ట్రో వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. క్యాన్సర్ వ్యాధులకు సంబంధించి 'బ్రిడ్జ్ ది గ్యాప్స్–లివర్ చాప్టర్'పై హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో నిర్వహించిన జాతీయ సదస్సు, లైవ్ వర్క్‌షాప్‌లో పలువురు వైద్యనిపుణులు కాలేయ వ్యాధులపై చర్చించారు. కాలేయ వ్యాధులు దేశంలో అంటువ్యాధిలా వ్యాప్తి చెందుతున్నాయని, ప్రతి ఐదుగురు పెద్దలలో ఒకరు దీని బారిన పడుతున్నారని వెల్లడించారు. కాలేయ వ్యాధి సంబంధిత మరణాలు సంవత్సరానికి 2,68,580 (మొత్తం మరణాలలో 3.17శాతం)కి చేరుకున్నట్టు నిపుణులు వివరించారు. విస్తరిస్తున్న వ్యాధుల బారి నుంచి తప్పించుకునేందుకు పాటించాల్సిన జాగ్రతలు, రోగుల సంరక్షణ, పరిశోధన, వైద్య విద్యలో కొత్త ప్రమాణాలు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. ముఖ్యంగా వైరల్ హెపటైటిస్, ఫ్యాటీ లివర్, లివర్ ఫైబ్రోసిస్, లివర్ సిర్రోసిస్, లివర్ క్యాన్సర్‌లకు సంబంధించిన సమస్యలను ఈ సదస్సులో చర్చించారు. ఈ సదస్సులో యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, డాక్టర్ నవీన్ పోలవరపు, డాక్టర్ సంతోష్ ఎనగంటి, కేఎస్ సోమశేఖర్‌రావు, డాక్టర్ గోపీ శ్రీకాంత్, డాక్టర్ శరత్‌చంద్ర గోరంట్లతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 500 మంది మెడికల్ గ్యాస్ట్రో, సర్జికల్ గ్యాస్ట్రో నిపుణులు పాల్గొన్నారు.

## జేపీ నడ్డా సతీమణి కారు అపహరణ

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సతీమణి కారు దొంగతనానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కారును డ్రైవర్ జోగిందర్ దక్షిణ ఢిల్లీలోని గోవింద్ పురిలో ఉన్న ఓ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 19న పెట్టారని, అక్కడి నుంచి ఆయన ఇంటికి వెళ్లి, తిరిగి వచ్చి చూసేసరికి ఆ కారు కనిపించలేదని చెప్పారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించినపుడు ఈ కారు గురుగ్రామ్ వైపు వెళ్తుండగా చివరిసారి కనిపించిందన్నారు. ఇప్పటి వరకు దాని ఆచూకీ లభించలేదని తెలిపారు.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### 'పది' పరీక్ష నేడు గంటన్నరే..

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి విద్యార్థులకు అలర్ట్. మంగళవారం గంటన్నరపాటే పరీక్ష నిర్వహిస్తారు. సైన్స్ పరీక్షలో భాగంగా ఒకరోజు ఫిజిక్స్ పేపర్‌కు, మరోరోజు జీవశాస్త్రం పేపర్‌కు పరీక్షలు నిర్వహించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోఉదయం 9 : 30గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకే ఫిజిక్స్ పేపర్‌కు పరీక్ష జరుగుతుంది. తెలుగు, ఇంగ్లిష్, కన్నడ, ఉర్దూ, హిందీ, మరాఠీ మీడియం విద్యార్థులకు వేర్వేరు ప్రశ్నపత్రాలిస్తారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు 40 మార్కుల ప్రశ్నపత్రం ఇవ్వనున్నారు. ఇక పార్ట్ –బీ (బిట్ పేపర్)ను ఆఖరి 15 నిమిషాల ముందు (10 : 45గంటలకు) ఇస్తారు. గురువారం జీవశాస్త్రం పరీక్ష కూడా గంటన్నర పాటే నిర్వహిస్తారు. ఈ పరీక్షకు 40మార్కులకే ప్రశ్నపత్రం ఇవ్వనుండగా, చివరి 15 (10 : 45) నిమిషాల ముందు పార్ట్ –బీ (బిట్‌పేపర్)ను అందజేస్తారు. అయితే, ఈ రెండు పేపర్లను స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్), స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తారు. కానీ, ఫలితాలు ప్రకటించే సమయంలో మాత్రం రెండు పేపర్ల మార్కులను కూడి ఒకే పేపర్‌గా పరిగణించి వెల్లడిస్తారు.

### ఆర్మ్‌డ్ ఫోర్స్ ప్రిపరేటరీ గురుకుల డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు

హైదరాబాద్, మార్చి25 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఉన్న ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని ఆర్మ్‌డ్ ఫోర్స్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు ఏప్రిల్ 15లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. యూజీ, ఐదేండ్ల ఎంఏ ఎకనామిక్స్ ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. మే 6న రాతపరీక్ష నిర్వహించి అందులోని మెరిట్ ఆధారంగా అడ్మిషన్లకు ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 79950 10687, 94939 64798 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### ఫీజు తగ్గించి దరఖాస్తులు స్వీకరించాలి : 'రావుల'

హైదరాబాద్, మార్చి25 (నమస్తే తెలంగాణ): టెట్ ఫీజు తగ్గించిన తర్వాతే దరఖాస్తులు స్వీకరించాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్షలను ఆన్‌లైన్‌కు బదులుగా ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తే ఫీజు తగ్గుతుందని ఆయన సూచించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఫీజు ఫ్రీ అని చెప్పి టెట్‌కు రూ. 2వేలకు పెంచడం అత్యంత దారుణమని పేర్కొన్నారు.

### ఎన్నికలు ముగిశాక హెచ్‌వోడీల నియామకం

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వివిధ విభాగాలకు రెగ్యులర్ హెచ్‌వోడీలను నియమిస్తామని వైద్యారోగ్య శాఖ తెలిపింది. ఇటీవల ఇన్‌చార్జి డీఎంఈ వాణి నియామకాన్ని హైకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ స్పందించింది. డీఎంఈ నియామకానికి ఇప్పటికే డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీని వేశామని తెలిపింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నియామకం నిలిచిపోయిందని పేర్కొన్నది. కోడ్ ఎత్తివేయగానే రెగ్యులర్ డీఎంఈని నియమిస్తామని స్పష్టంచేసింది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్), వైద్యవిధాన పరిషత్తు (టీవీవీపీ) కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) డైరెక్టర్ పోస్టులను కూడా కోడ్ పూర్తయిన వెంటనే నియమిస్తామని వెల్లడించింది.

### బ్రిడ్జి కోర్సు చేసినవారు ఫార్మసీ డిప్లొమాలకు అర్హులే

హైదరాబాద్, మార్చి 25, (నమస్తే తెలంగాణ): 2020కి ముందు ఇంటర్ వొకేషనల్ కోర్సు, బ్రిడ్జి కోర్సు చేసిన వాళ్లు ఫార్మసీ డిప్లొమాలకు అర్హులని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ కోర్సులను పూర్తిచేసిన వారిని ఫార్మసిస్టుగా గుర్తింపు ఇవ్వాలని ఫార్మసీ కౌన్సిల్‌ను ఆదేశించింది. కాగా, డీఫార్మసీలో అడ్మిషన్లకు ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసిన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ బ్రిడ్జి కోర్సు సర్టిఫికెట్లను ఆమోదించరాదని ఫార్మసీ కౌన్సిల్ అఫ్ ఇండియా–2011లో నిర్ణయించింది. ఈ మేరకు జారీ చేసిన ప్రొసీడింగ్స్ ను మహ్మద్ ఇర్ఫాన్ అన్సారీ సహా 18 మంది వేర్వేరుగా 2013 నుంచి 2017 వరకు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ జే అనిల్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పైవిధంగా తీర్పును వెలువరించింది.

# పరిమళించిన మానవత్వం

- అనాథ వృద్ధురాలికి అంత్యక్రియల నిర్వహణ
- పెద్దమనసు చాటిన 'సహృదయ' యాకూబ్‌బీ

భువనగిరి కలెక్టరేట్, మార్చి 25: కన్నవారు, అయినవారు, తోబుట్టువులు, రక్తసంబంధీకులు అనే బంధాల బంధాలను తెంచేస్తూ.. మంచితనాన్ని మంటగలుపుతున్న ప్రస్తుత సమాజంలోనూ మానవత్వం ఎక్కడో ఓ చోట పరిమళిస్తూనే ఉన్నది. అందుకు.. ఓ అనాథ వృద్ధురాలికి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించిన వృద్ధాశ్రమమే నిదర్శనం. ఈ ఘటన సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరి సహృదయ అనాథాశ్రమంలో చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఖాందేశ్ చంద్రకళ(70)ను సోదరుడు గంగాప్రసాద్ జనవరి 19న రాయగిరిలోని సహృదయ వృద్ధాశ్రమంలో చేర్పించాడు. అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రకళ ఈ నెల 23న మృతి చెందింది. ఈ విషయాన్ని ఆశ్రమ నిర్వాహకులు యాకూబ్‌బీ, చోటు దంపతులు మృతురాలి సోదరుడికి ఫోన్ ద్వారా తెలిపారు. వృద్ధురాలి మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అతను నిరాకరించడంతో పాటు నిర్లక్ష్యంగా మాట్లాడి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. వృద్ధురాలి బంధువుల కోసం రెండు రోజులపాటు ఎదురుచూసినప్పటికీ ఎవరూ రాలేదు. చేసేదేమీ లేక ఆశ్రమ నిర్వాహకురాలు యాకూబ్‌బీ అన్నీ తానైంది. సోమవారం భువనగిరిలోని రాయగిరి శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం చంద్రకళ అంత్యక్రియలు నిర్వహించారు. యాకూబ్‌బీ మతం వేరైనా.. అనాథ వృద్ధురాలికి హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు చేయడం పట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తాయి.



అనాథ వృద్ధురాలు చంద్రకళ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సహృదయ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు యాకూబ్‌బీ



ఆశ్రమ బాలికల పాఠశాల నుంచి ఆటోలో తరలిస్తున్న బియ్యం బస్తాలు

## విద్యార్థినుల సాహసం

- ఆశ్రమ పాఠశాల బియ్యం పట్టివేత
- ఆటోలో తరలిస్తుండగా అడ్డగింత

జైనూర్, మార్చి 25: ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని విద్యార్థినులు సాహసోపేతంగా పట్టుకున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్‌లోని బాలికల ఆశ్రమ పాఠశాలలో 300 మందికిపైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. మూడు రోజుల నుంచి రోజూ అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఆటోలో రాగోజీ అనే వ్యక్తి ఆశ్రమ పాఠశాల బియ్యాన్ని తీసుకెళ్తున్నాడు. దీనిని విద్యార్థినులు గమనిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు కూడా 15 బస్తాల (ఒక్కో బస్తా 50 కిలోలు)ను ఆటోలో వేస్తున్నాడు. దీనిని గుర్తించిన కొందరు విద్యార్థినులు పక్కా ప్రణాళికతో సాహసం చేసి అడ్డుకున్నారు. కేకలు వేయడంతో గ్రామస్థులు జమ అయ్యారు. ఇంతలో ఆటోడ్రైవర్ రాగోజీ పారిపోగా.. పట్టుకున్న ఆటోను హాస్టల్లోనే ఉంచారు. ఈ విషయమై ఏటీడీవో పురుషోత్తంను వివరణ కోరగా.. తనకు ఇప్పుడే తెలిసిందని తెలిపారు. ప్రిన్సిపాల్ పరశురాంను అడుగగా.. ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని లోనుపై తీసుకున్నామని, ఆ బియ్యాన్ని వాపసు పంపిస్తున్నామని తెలిపారు.

# రేపు హైకోర్టు నిర్మాణానికి శంకుస్థాపన!

- హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఉన్నతాధికారులతో మంతనాలు
- విద్యార్థుల కట్టడి బాధ్యత యూనివర్సిటీ ఉన్నతాధికారులకు
- అడ్డుకుంటామని తేల్చి చెప్పిన విద్యార్థి, ప్రజాసంఘాలు

వ్యవసాయ యూనివర్సిటీ , మార్చి 25 : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవన నిర్మాణానికి రంగం సిద్ధమైంది. హైకోర్టు భవన నిర్మాణ పనులకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వ్యవసాయ యూనివర్సిటీ భూములను లాక్కోవద్దని విద్యార్థులు కొన్ని రోజులుగా నిరసనలు, తీవ్ర ఆందోళనలు చేపడుతున్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు బలగాల నడుమ గుట్టుచప్పుడు కాకుండా పనులు చేపడుతున్నది. రాత్రికి రాత్రే యంత్రాలతో భారీ చెట్లు తొలగించేశారు. రెండు నెలల నుంచి బయోడైవర్సిటీ పార్కుకు నీటి వసతిని నిలిపి వేశారు. దీంతో ఏండ్ల తరబడి పెంచిన చెట్లు కూడా ఎండిపోయాయి. జీవరాసులకు నీటివసతి లేక తమ గూడును మార్చాయి. తాజాగా 10 ఎకరాలలో ఉన్న ఉద్యాన (సపోట), ఔషధ మొక్కలు (లెమన్ గ్రాస్) తొలిగించి వేదిక ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు విద్యార్థుల నుంచి ప్రతిఘటన వ్యక్తం కాకుండా ఉన్నతాధికారులతో రహస్య మంతనాలు చేస్తున్నట్టు తెలిసింది. విద్యార్థి ఉద్యమాలను నీరుగార్చే బాధ్యతను వర్సిటీ ఉన్నతాధికారులకే అప్పగించినట్టు సమాచారం. హైకోర్టు భవన నిర్మాణాన్ని అడ్డుకోవడానికి విద్యార్థి విభాగాలు, ప్రజాసంఘాలు, ప్రతిపక్ష నాయకులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ భూముల్లో శంకుస్థాపనకు సిద్ధం చేసిన స్థలం

### అడ్డుకుంటాం

వ్యవసాయ యూనివర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మాణమేంటో ? కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 3నెలల్లోనే యూనివర్సిటీ అస్థిత్వం దెబ్బతినేలా చేస్తున్నది. జంతు, పక్షి, ఔషధ వృక్షజాతులు, లక్షల వృక్ష సంపద నాశనం అవుతున్నది. రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నాం. అయినా రాత్రికి రాత్రే అన్యాక్రాంతం చేస్తున్నారు. విద్యార్థులకు, రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారు. భారీగా పోలీసులను మోహరించి పనులు చేస్తున్నారు. అయినా అక్రమంగా చేస్తున్న శంకుస్థాపనను అడ్డుకుంటాం.

– చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

### రియల్ ఎస్టేట్ కోసమే...



ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నది. ఇది కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడానికే. దాదాపు 40 ఏండ్లుగా ఎన్నో జీవరాశులను, ప్రకృతిని అక్కడ పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో విద్యార్థులు, ప్రొఫెసర్లు, న్యాయదేవత సాక్షిగా అవన్నీ అంతరించడం బాధాకరం.

– ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు

# హోలీ వేడుకల్లో 14 మంది మృతి

- వార్ధా నదిలో స్నానానికి వెళ్లి నలుగురు స్నేహితులు
- హనుమకొండలో ఎస్సారెస్పీ కెనాల్‌లో ఇద్దరు మృత్యువాత
- నందపల్లిలో పెద్ద చెరువులో పడి మరో ఇద్దరు యువకులు
- ట్యాంక్ కూలి చిన్నారి తుదిశ్వాస వేర్వేరుగా ఐదుగురు దుర్మరణం



కమలాకర్(ఫైల్)



సంతోష్ (ఫైల్)



ప్రవీణ్(ఫైల్)



ఆలం సాయి(ఫైల్)

న్యూస్ నెట్‌వర్క్, (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హోలీ వేడుకల్లో పలుచోట్ల తీవ్ర విషాదం నెలకొన్నది. హోలీ ఆడిన తర్వాత స్నానాలు చేసే క్రమంలో నదులు, కాల్వలు, చెరువు వద్దకు వెళ్లి వేర్వేరుచోట్ల 14 మంది మృత్యువాత పడ్డారు. మరొకరు గల్లంతయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. పోలీసులు, మృతుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల మండల కేంద్రంలోని నదీమాబాద్‌కు చెందిన పనాస కమలాకర్ (23), ఉప్పుల సంతోష్ (22), ఎల్ములే ప్రవీణ్ (23), ఆలం సాయి (20).. తాటిపల్లి సమీపంలోని వార్ధా నదికి స్నానానికి వెళ్లి నీట మునిగి చనిపోయారు.

### మంచిర్యాలలో ఇంటర్ విద్యార్థి

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఇంటర్ చదివే కార్తిక్ తన స్నేహితులతో కలిసి స్నానం చేయడానికి తానిమడుగు డెలివరీ పాయింట్ వద్ద నీటిలోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగి చనిపోయాడు.

### వాగులో మునిగి ఒకరు

ఆదిలాబాద్‌లోని జైజవాన్ నగర్‌కు చెందిన హర్షిత్ (14) హోలీ ఆడిన తర్వాత ఆదిలాబాద్ మండలంలోని భీంసరి వాగులో స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతి చెందాడు.

### నందుపల్లి పెద్ద చెరువులో ఇద్దరు

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నందుపల్లికి చెందిన ఇద్దరు చెరువులో పడి మృతి చెందారు. గ్రామానికి చెందిన భిక్షమయ్య కుమారుడు సంగం జగన్ (27) వ్యవసాయం చేస్తాడు. అదే గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు కొమ్ము సురేందర్ (28) వృత్తి డ్రైవర్. ఇద్దరు హోలీ ఆడుకొని నందపల్లి పెద్ద చెరువు దగ్గరకు ఈతకు వెళ్లారు. ఇద్దరు చెరువులోకి దిగి ఈత కొడుతూ కనిపించకుండాపోయారు. గజఈతగాల సహాయంతో ఇద్దరు మృతదేహాలను బయటకు తీశారు.

### ట్యాంకు కూలి చిన్నారులకు గాయాలు

నారాయణపేట జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో హోలీ సంబురాల్లో చిన్నారులు నిమగ్నమై ఉండగా.. పక్కనున్న వాటర్ ట్యాంక్ ఒక్కసారిగా కూలిపడింది. సిమెంట్ ముక్కలు తగిలి చిన్నారులపై పడటంతో లక్ష్మీ ప్రణీత(12), నిహారిక, హరిప్రియకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ లక్ష్మీ ప్రణీత చనిపోయింది.

### వ్యవసాయ బావిలో ఈత కొడుతూ..

వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మామిడిమాడలో హోలీ అనంతరం యువకులు స్నానం చేసేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. ఈత కొడుతున్న సమయంలో శ్రీకాంత్ (16) నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు బయటికి తీసి దవాఖానకు తరలించినా అప్పటికే చపోయాడు.

### మహబూబాబాద్‌లో బాలుడు

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన అబ్బోరి వినోద్‌రెడ్డి కుమారుడు రిత్విక్‌రెడ్డి (10) 4వ తరగతి చదువుతున్నాడు. హోలీ అనంతరం స్నానం చేసేందుకు గణేశ్ చెరువు వద్దకు వెళ్లాడు. కాలు జారి చెరువులోని గుంతలో పడిపోయాడు. అతని స్నేహితులు భయంతో వచ్చి గ్రామంలో చెప్పడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూసేసరికి రిత్విక్ మృతి చెందాడు.

### మొర్రేడు వాగులో ఆటో డ్రైవర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీకి చెందిన మోకాళ్ల రాంబాబు (25) ఆటో డ్రైవర్. స్థానికులతో హోలీ ఆడాడు. స్నేహితులతో కలిసి స్నానం చేసేందుకు మొర్రేడు వాగు వద్దకు వెళాడు. రాంబాబు వాగులో దిగడంతోనే బండపై కాలు పెట్టాడు. అది జారడంతో లోతులోకి మునిగి మృతిచెందాడు.

### ముగ్గురిని కాపాడిన కానిస్టేబుల్

ముగ్గురు స్నేహితులు హోలీ సందర్భంగా రంగులు పూసుకున్నారు. గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఓ కానిస్టేబుల్ నిమిషాల్లో నది వద్దకు చేరుకుని వారిని ప్రాణాలతో బయటకు తీసువచ్చాడు. ఈ ఘటన భద్రాద్రి జిల్లా మణుగూరు మండల పరిధిలోని కొండాయిగూడెంలో జరిగింది.

### ఎస్సారెస్పీ కెనాల్‌లో పడి ఇద్దరు

హనుమకొండలోని కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలివేల్పుల ఎస్సారెస్పీ కెనాల్‌లో పడి ఇద్దరు మృతి చెందారు. ఒకరు గల్లంతయ్యారు. దామెర మండలం ఊరుగొండకు చెందిన తక్కెళ్ల కేదారేశ్వర్(42), ముప్పు క్రాంతికుమార్(35) పలివేల్పుల వద్ద అద్దె గృహంలో ఉంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. హోలీ వేడుకల్లో పాల్గొన్న వీరు ఊరుగొండకు చెందిన పండుగ భిక్షపతి పలివేల్పుల సమీపంలోని ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ వద్దకు వెళ్లారు. స్నానం కోసం కేదారేశ్వర్, క్రాంతికుమార్ కెనాల్‌లో దిగగా నీటి ప్రవాహ వేగానికి గల్లంతు కాగా, పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది మృతదేహాలను వెలికితీశారు. కేదారేశ్వర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు, క్రాంతికుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఐఐసీటీ సైంటిస్ట్‌కు జేజీ కనే అవార్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : వంట నూనెలు, ఆరోగ్యకరమైన కొవ్వులపై పరిశోధనలు చేసే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలోని చీఫ్ సైంటిస్ట్ ప్రభావతికి జేజీ కన్నే అవార్డు వరించింది. ఆయిల్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా.. ఈ రంగంలో విశేష కృషితోపాటు ఆధునిక టెక్నాలజీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన పరిశోధకులకు ప్రొఫెసర్ జేజీ కనే స్మారక పురస్కారంతో సత్కరిస్తున్నది. 2022 ఏడాదికి ఈ అవార్డును డాక్టర్ ప్రభావతి దేవీ దక్కించుకొన్నారు. కాగా, ఆమె ఎంపికపై ఐఐసీటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## ఫీజులతో ఖజానా నింపుతారా? : ఏబీవీపీ

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజును తగ్గించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు (ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ డిమాండ్ చేశారు. బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఫీజుల పెంపుపై పునరాలోచించాలని కోరారు. నిరుద్యోగుల ఫీజులతో రాష్ట్ర ఖజానాను నింపుకోవాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వమంటే.. ఫీజుల పెంచడం, నిరుద్యోగులపై భారం మోపడమేనా..? ఫీజులను 150% నుంచి 300శాతానికి పెంచడమేనా. ? ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రాయితీనివ్వకపోవడమేనా.. ? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం టెట్ ఫీజును తగ్గించకపోతే నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఝాన్సీ హెచ్చరించారు.

## మోదీపై అనుచిత వ్యాఖ్యలు.. తమిళనాడు మంత్రిపై కేసు

చెన్నై: ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి అనిత ఆర్ రాధాకృష్ణన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. బీజేపీ దక్షిణ తూత్తుకూడి జిల్లా శాఖ అధ్యక్షుడు ఆర్ సిద్ధాంగథన్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశామన్నారు. ట్యుటికోరిన్ జిల్లాలోని తాండపథులో ఈ నెల 22న జరిగిన డీఎంకే కార్యకర్తల సమావేశంలో అనిత ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో ఆరోపించారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కామరాజ్‌ను మోదీ ప్రశంసించారని, అందుకే అనిత అసభ్యకరంగా మాట్లాడారని సిద్ధాంగథన్ చెప్పారు. మరోవైపు తమిళనాడు బీజేపీ ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్ ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు.

### సీతా అశోక మొక్క.. విరబూసింది ఎంచక్కా



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో పెరుగుతున్న సీతా అశోక జాతికి చెందిన అరుదైన మొక్క.. సోమవారం ఎంచక్కా విరబూసింది. ఈ మొక్కను ఏపీలోని యోగి వేమన యూనివర్సిటీలోని లీడ్ బొటానికల్ గార్డెన్ నుంచి తీసుకొచ్చి ఇక్కడ పెంచుతున్నట్టు గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య తెలిపారు. ఈ మొక్క శాస్త్రీయ నామం 'సరాక అశోక' అని పేర్కొన్నారు.

–జడ్చర్ల టౌన్

# సోలార్ యూనిట్లపై రాయితీ పెంపు

- చిన్న ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే వారికి అధిక రాయితీ ఇవ్వనున్న కేంద్రం



హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఇండ్లపై సోలార్ విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం రాయితీలను గణనీయంగా పెంచింది. పీఎం సూర్య ఘర్–ముఫ్త్ బిజిలీ యోజన కింద 2 నుంచి 7 కిలోవాట్లలోపు సామర్థ్యంతో కూడిన చిన్న యూనిట్లను ఏర్పాటు చేసుకునేవారికి గతంలో కంటే భారీగా రాయితీలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. కానీ, 8 నుంచి 10 కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన పెద్ద యూనిట్లను ఏర్పాటు చేసుకునేవారికి మాత్రం సబ్సిడీని తగ్గించింది.

### సబ్సిడీల పెంపు ఇలా..

- 2 కిలోవాట్ల ప్లాంట్‌కు ఇచ్చే సబ్సిడీ రూ.29 వేల నుంచి రూ.60 వేలకు పెంపు. దీంతో వినియోగదారుడు చెల్లించే యూనిట్ విలువ రూ.1.20 లక్షల నుంచి రూ.62 వేలకు తగ్గింది.
- 3 కిలోవాట్ల ప్లాంట్‌కు ఇచ్చే సబ్సిడీని రూ.43 వేల నుంచి రూ.78 వేలకు పెంచడంతో వినియోగారుడికి రూ.41 వేలు ఆదాకానున్నది.
- 5 కిలోవాట్ల ప్లాంట్‌కు ఇచ్చే సబ్సిడీ రూ.58 వేల నుంచి రూ.78 వేలకు పెంపు.
- 8 నుంచి 10 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన పెద్ద యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి రూ.78 వేల సబ్సిడీ ఇవ్వనున్నారు.

### యూనిట్లవారీగా వివరాలు (రూపాయల్లో)

| సామర్థ్యం | యూనిట్ ధర (గతంలో) | సబ్సిడీ (గతంలో) | వినియోగదారు చెల్లించేది (గతంలో) |
|---|---|---|---|
| 1 కిలోవాట్ | 87,830 | 14,588 | 73,242 |
| 2 కిలోవాట్లు | 1,44,000 (1,49,310) | 60,000 (29,176) | 62,400 (1,20,134) |
| 3 కిలోవాట్లు | 2,06,400 (2,12,890) | 78,000 (43,764) | 1,28,400 (1,69,126) |
| 4 కిలోవాట్లు | 2,59,600 (2,67,270) | 78,000 (51,058) | 1,81,600 (2,16,212) |
| 5 కిలోవాట్లు | 3,24,500 (3,33,350) | 78,000 (58,352) | 2,46,500 (2,74,998) |
| 6 కిలోవాట్లు | 3,89,400 (3,99,430) | 78,000 (65,646) | 3,11,400 (3,33,784) |
| 7 కిలోవాట్లు | 4,54,300 (4,65,510) | 78,000 (72,940) | 3,76,300 (3,92,570) |
| 8 కిలోవాట్లు | 5,19,200 (5,31,590) | 78,000 (80,234) | 4,41,200 (4,51,356) |
| 9 కిలోవాట్లు | 5,84,100 (5,97,670) | 78,000 (87,528) | 5,06,100 (5,10,142) |
| 10 కిలోవాట్లు | 6,49,000 (6,63,750) | 78,000 (94,822) | 5,71,000 (5,68,928) |